తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## బ్రహ్మోత్సవాలకు మాస్క్ తప్పనిసరి !

### తిరుమల,అలిపిరిలో తాత్కాలిక వసతి
### అలిపిరి వద్ద ప్రత్యేక పార్కింగ్



తిరుమల,ఆగస్టు 4(ప్రభాతవార్తప్రతినిధి:
రెండేళ్ళ తరువాత కలియుగవైకుంఠవాసుడు శ్రీవేంకటేశ్వరునికి భక్తుల మధ్య జరగనున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు మాస్క్‌తప్పని సరిగా ధరించాలని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. భక్తులు మాస్క్ ధరించి రావాలని, బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజులు తిరుమలతోబాటు అలిపిరిలోనూ తాత్కాలిక వసతిని భక్తులకు కల్పిస్తామన్నారు. అంతేగాక అలిపిరి వద్ద ప్రత్యేకంగా ద్విచక్రవాహనాలతోబాటు నాలుగుచక్రవాహనాల పార్కింగ్‌ను కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఏర్పాట్లు, సౌకర్యాలపై గురువారం సాయంత్రం అన్నమయ్యభవనంలో టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఇతరఅధికారులతో కలసి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాప్రతినిధులతో మాట్లాడుతూ సెప్టెంబర్ మాసం 27వతేదీ నుంచి అక్టోబర్ 5వరకు తిరుమలలో జరగనున్న దేవుని బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు మాస్క్‌తప్పనిసరిగా ధరించాలన్నారు. తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 26న అంకురార్పణ, 27న సాయంత్రం మీనలగ్నంలో 5.45గంటల నుంచి 6.15వరకు ధ్వజారోహణం, అదేరోజు రాత్రి పెద్దశేషవాహనసేవ, అక్టోబర్ 1న గరుడసేవ, 2న స్వర్ణరథం, 4న రథోత్సవం, 5న చక్రస్నానం ప్రధాన ఘట్టాలన్నారు. సామాన్యభక్తులకు దర్శనంలో ప్రాధాన్యత నిచ్చేలా చూస్తూ అన్ని ప్రత్యేక దర్శనాలను, ఆర్జితసేవలను కూడా రద్దుచేయడం జరుగుతుందన్నారు. అలిపిరిలో కూడా వాహనాల రద్దీని బట్టి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఉదయం వాహన సేవలను 8గంటలకే, రాత్రి వాహనసేవలు 7గంటలకే మొదలవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి జెఇఒలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, అదనపు ఎస్పీలు విమలకుమారి, కులశేఖర్, ఆలయ డిప్యూటీ ఇఓ రమేష్‌బాబు, డిప్యూటీ ఇఓలు హరీంద్రనాద్, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఇలు జగదీశ్వరరెడ్డి, వేంకటేశ్వర్లు, పిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ ఫెన్సింగ్‌కు నిధులు మంజూరు

### - కేంద్ర మంతిని కలిసి విన్నవించిన ఎంపీ రెడ్డప్ప



చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త:
చిత్తూరు పార్లమెంటు పరిధిలోని పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా చేయడానికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని చిత్తూరు ఎంపీ రెడ్డప్ప కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌ను కలిసి విన్నవించారు. చిత్తూరు ఎంపీ రెడ్డప్ప గురువారం కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేంద్ర మంత్రితో మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధి అత్యధికంగా అటవీ సరిహద్దు గ్రామాల వెంబడి వుందన్నారు. ఈ అటవీ సరిహద్దు గ్రామాలపై తరచు ఏనుగులు దాడులు చేస్తుంటాయన్నారు. ఏనుగులు గ్రామాలపై రాకుండా వుండటానికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఇందుకోసం నిధులు విడుదల చేయాలని ఆయన కేంద్ర మంత్రిని కోరారు.

## నాకు పులివెందుల ఎంతో.. కుప్పం అంతే

### కుప్పం అభివృద్ధికి అండగా ఉంటా.. భరత్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తా !! కుప్పం నియోజకవర్గం కార్యకర్తలతో సిఎం జగన్



సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి , హాజరైన కుప్పం నేతలు

కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త
నాకు పులివెందుల నియోజకవర్గం ఎంత ముఖ్యమో కుప్పం కూడా అంతే ముఖ్యమని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పంలో తప్పక విజయం సాధించాలని ఈ బాధ్యతను కుప్పం నేతలు, కార్యకర్తల భుజస్కందాలపై ఉంచుతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గ వైకాపా శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి తాను అన్ని విధాలా అండగా ఉంటానని స్పష్టం చేశారు. కుప్పంలో గతంలో చంద్రబాబు చేసిన దానికంటే అధికంగా అభివృద్ధి చేద్దామని సిఎం నేతలతో పేర్కొన్నారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి గాను 67 కోట్ల నిధులు మంజూరు చేస్తామని సిఎం ప్రకటించినట్లు సమాచారం. కుప్పంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ భరత్‌ను గెలిపిస్తే అతన్ని మంత్రిని చేసి కుప్పం ప్రజలకు మరింత దగ్గరగా ఉండేలా చూస్తానని సిఎం పేర్కొన్నారు. గతంలోకుప్పంలో గెలుపు అంటే ఇతర పార్టీలకు ప్రశ్నార్థకంగా ఉండేదని నేడు ఆ పరిస్థితుల్లో పూర్తిగా మార్పు వచ్చినట్లు సిఎం పేర్కొన్నారని తెలిసింది. కుప్పం నియోజకవర్గంలో పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గెలిచిందనే విషయం గుర్తు చేశారు. ఇప్పుడు పార్టీ కోసం నేతలు, కార్యకర్తలు బాగానే కష్టపడుతున్నారని మరికొంత కష్టపడితే కుప్పంలో గెలుపు దక్కడం ఖాయమన్నారు. కుప్పంలో ఎందుకు గెలవలేమని నేతలను ప్రశ్నించారు. కుప్పంలో ప్రతి రెండు నెలలకు ఓసారి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటించేలా చూస్తామని, కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం అమలు చేస్తోందని ఈ విషయంను నేరుగా ప్రజల దగ్గరకు వెళ్లి ప్రజలకు వివరించాలని సిఎం ఆదేశించినట్లు సమాచారం. గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంతో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నేతలు ప్రజలతో మమేకం కావాలని సిఎం సూచించినట్లు తెలిసింది. అనంతరం వివిధ అంశాలపై నేతలతో ముఖ్యమంత్రి చర్చించారు. కుప్పం నుంచి వెళ్లిన ప్రతి నేత, కార్యకర్తను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిగతంగా పలకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు కెఆర్‌జె భరత్, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, ఎంపిపిలు అశ్విని,వరలక్ష్మి, జడ్పీటిసిలు ఎడిఎస్ శరవణ, కృష్ణమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్,ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, నాలుగు మండలాల కన్వీనర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు వరలక్ష్మీ వ్రతం!

### - ఘనంగా ఏర్పాట్లు చేసిన టిటిడి
### -సాయంత్రం స్వర్ణ రథం






తిరుచానూరు,ఆగస్టు 4 ప్రభాతవార్త:
మహా మంగళ దేవత,లక్ష్మీ అవతారమైన అలమేలుమంగమ్మ అవతరించిన దివ్యస్థలం తిరుచాననూరు.సాక్షాత్తూ శ్రీ మహాలక్ష్మియే తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి తపోదీక్షకు ప్రతిఫలంగా పద్మసరోవరంలో వెలసింది.శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం వ్రతం ఆచరించాలి.ఈ వ్రతం చేసిన మహిళలకు దీర్ఘ మాంగళ్య సౌభాగ్యం,సిరి సంపదలు, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం వంటివెన్నో మహా ఫలాలు అందుతాయని తిరుచానూరులో విశేషమైన ఈ వ్రతంలో పాల్గొనాలని భక్తుల విశ్వాసం.ఇందులో భాగంగా రంగురంగుల విద్యుద్దీపాలు,పలు రకాల పుష్పాలతో ఆస్థాన మండపాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.ఆలయ పరిసరాల్లో రంగవల్లులుతీర్చిదిద్ది శోభాయమా నంగా అలంకరించారు.అలాగే భక్తుల మధ్య తోపుఎలాటలు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.శుక్రవారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు వరలక్ష్మి వ్రతాన్ని ఘనంగా నిర్వహిస్తారు.సాయంత్రం 6 గంటలకు శ్రీ పద్మావతీ అమ్మవారు స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.ఈ వ్రతాన్ని శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానెల్ ద్వారా ప్రసారం చేయనున్నారు.

## తిరంగా సెల్ఫీ పాయింట్
## ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభం




ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి


తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 4 ప్రభాతవార్త ః
అజాదీకా అమృత్ మహోత్సవ్-హర్ ఘర్ తిరంగాలో భాగంగా గురువారం సెల్ఫీ పాయింట్, ఫోటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. త్రివర్ణ పతాక సెల్ఫీ పాయింట్‌ను సమాచార పౌర సంబంధాల శాఖ, టూరిజం శాఖ వారు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య ఛాయా చిత్రాలను స్వాతంత్ర్య సాధనలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. కలెక్టర్‌తో పాటు డీఆర్వో శ్రీనివాసులు ఉన్నారు. ఈ ఫోటో ప్రదర్శనను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశానికి 75 సంవత్సరాల స్వాతంత్ర్యం సిద్ధించిన సందర్భంగా భారత, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఆగష్టు 1 నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలను రూపొందించి ప్రజలలో జాతీయతా భావం పెంపొందే విధంగా ఊరు వాడల జాతీయ జెండాలు ప్రతి ఇంటిపై, దుకాణాలు, కార్యాలయాలు, పరిశ్రమల పరిధిలో ఎగురవేసే విధంగా అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసి, గ్రామ, వార్డు సచివాలయాల వాలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి అందనున్న జాతీయ జెండాలు తేది 13-15లలో ప్రజలు ఎగురువేసేలా చర్యలు తీసుకుని హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించడం, వారి విగ్రహాలను ప్రముఖ కట్టడాలను శుభ్రపరిచి అలంకరించడం లాంటి పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని తెలిపారు. అందరూ స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ అధికారులతో కలిసి సెల్ఫీ పాయింట్ వద్ద ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి ఉమాపత, ఏడీ అర్కియాలజీ శివప్రసాద్, పౌరసరఫరాల సంబంధాల అధికారి విజయ సింహారెడ్డి, సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య, జిల్లా వ్యవసాయశాఖాధికారి దొరసాని, కలెక్టరేట్ పరిపాలనాధికారి జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కాణిపాకంలో నూతన ధ్వజస్థంభం ప్రతిష్ట



కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో నూతనంగా ధ్వజస్థంభం ప్రతిష్ట గురువారం వైభవోపేతంగా జరిగింది. కాణిపాకం ఆలయంలో పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా సుమారు 10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో ప్రవాస భారతీయుడైన విజయవాడకు చెందిన ఐకా రవి, గుత్తికొండ శ్రీనివాస్ అనే దాతల సహకారంతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టి పూర్తి చేసిన విషయం విధితమే. అలాగే దాతలు బెంగుళూరుకు చెందిన రమణారెడ్డి సుమారు 7.50 లక్షల రూపాయల వ్యయంతో నూతన ధ్వజస్థంభంకు టేకు కొయ్యను అంది స్తుండగా సుమారు 2.70 కోట్లు రూపాయలను ధ్వజ స్థంభంకు బంగారుతాపడం వేయడానికి హైదరాబాద్‌కు చెందిన మణి కుటుంబీకులు అందిస్తున్నారు. ఈమేరకు గురువారం ఉదయం నూతన ధ్వజస్థంభం ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు ధర్మేశ్వర్‌గురుకల్ ఆధ్వర్యంలో రుత్వికులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండం వద్ద ప్రత్యేకహోమాలు నిర్వహించారు. నూతన ధ్వజస్థంభంను ప్రత్యేక భారీ క్రేన్‌ద్వారా ఆలయంలోని అన్వేటిమండపంలో ప్రతిష్ట గావించారు. అనంతరం అర్చకులు హోమగుండంలోని ప్రత్యేక కలశాలలోని పవిత్రజలంతో అభిషేకించి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబు, రాష్ట్ర స్థపతి పరమేశ్వప్ప, ఈఈ వెంకట నారాయణ, ఏసీ కసూ_రి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాబు, రమేష్, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఉభయదారుల కమిటీ ఛైర్మన్ ఈశ్వర్‌బాబు,దాతలు రమణారెడ్డి, మణి కుటుంబీకులు, ఆలయ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా క్రేన్‌లో సాంకేతిక కారణాల వల్ల ధ్వజస్థంభం ప్రతిష్ట సుమారు గంటన్నర పాటు ఆలస్యమైంది.

## వైభవంగా సైంధవ రథోత్సవం



4 లో

పుత్తూరు పట్టణంలో రథంపై ఊరేగుతున్న శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజస్వామి

## చిత్తూరు అభ్యర్థిత్వం కోసం వైకాపాలో పోటాపోటీ

### ఈ సారి సీటు నాదేనంటూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ధీమా - తగ్గేదే లేదంటున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి

చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త:
అధికార వైకాపాలో చిత్తూరు వైకాపా అభ్యర్థిత్వం కోసం పోటాపోటీ నెలకొంది. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మరోసారి వైకాపా అభ్యర్థిత్వం తనకే ఖరారు అవుతుందని ఆశిస్తుండగా ఆయనకు పోటీగా ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి నియోజకవర్గ పరిధిలో తన సత్తా చాటి పార్టీ అభ్యర్థిత్వం తనకు దక్కేలా పక్కా వ్యూహంతో అడుగులు వేస్తున్నారు. ఎన్నికలకు మరో రెండేళ్ళ సమయం వున్నప్పటికీ అధికార వైకాపా అభ్యర్థిత్వం కోసం నియోజకవర్గ స్థాయిలో అప్పుడే పోటీ ప్రారంభమైంది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా వున్న ఆరణి శ్రీనివాసులు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొంటూ పార్టీ క్యాడర్‌పై పట్టు నిలుపుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. అలాగే ఎపి ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి తన సొంత నిధులను దారళంగా ఖర్చు చేస్తూ క్షేత్ర స్థాయిలో పట్టు సాధించడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాయలసీమ జిల్లాల నుండి బలిజ సామాజిక వర్గానికి సంబంధించి ఒక్క చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి మాత్రమే వైకాపా అభ్యర్థిత్వం కేటాయించడంతో ఇదే తరహాలో రానున్న ఎన్నికల్లో సైతం అభ్యర్థిత్వాలు కేటాయిస్తే తనకు అభ్యర్థిత్వంపై ఢోకా వుండదని ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నమ్మకంగా వున్నారు. అలాగే జిల్లా మంత్రి పెద్దిరెడ్డి ఆశీస్సులతో పాటు వైకాపా అధిష్టానంలో పెద్దల సహకారం వుండటంతో తనకు అభ్యర్థిత్వం విషయంగా ఇబ్బంది వుండదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భావిస్తున్నారు. అయితే ఈ సారి ఎన్నికల్లో సామాజిక వర్గ సమీకరణల్లో భాగంగా రాయలసీమ



జిల్లాల్లో బలిజ కులస్తులకు ఎక్కడైనా వైకాపా అభ్యర్థిత్వం కేటాయిస్తే చిత్తూరు నుండి తనకు ఛాన్స్ తప్పక లభిస్తుందని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి ఆశలు పెట్టుకొన్నారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు చిత్తూరు రూరల్ మండలం, గుడిపాల మండలాలు వున్నాయి. రెండేళ్ళ క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రస్తుత ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్‌లు కలసి అత్యధిక కార్పొరేట్ స్థానాలను ఏకగ్రీవం చేశారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఖరారు చేసిన మేయర్ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. దీంతో పార్టీ అధిష్టానం జోక్యం చేసుకొని ప్రత్యామ్నాయ మేయర్ అభ్యర్థిగా ప్రస్తుత మేయర్ అముదను ఖరారు చేశారు. ప్రస్తుతం మేయర్ అముద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పుచేతుల్లో వున్నారు. ఈ క్రమంలో ఇటీవల జరిగిన మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా విజయానందరెడ్డి వర్గానికి చెందిన డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇది వరకు వున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులనే మరోసారి కొనసాగించాలని నిర్ణయించడం, ఎన్నికలకు డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి గైర్హాజరు కావడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించి మున్సిపల్ అధికారులు ఇది వరకు వున్న స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులనే కొనసాగించారు. ఈ పరిస్థితుల్లో చిత్తూరు నియోజకవర్గం పరిధిలో తన సత్తా చాటాలని నిర్ణయించిన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి తన పుట్టిన రోజు వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి పుట్టిన రోజు వేడుకలకు నగర పరిధిలో ఏర్పాటు చేసే బ్యానర్లు, కటౌట్లకు మున్సిపాల్టీకి చెల్లించే ఫీజును కచ్చితంగా చెల్లించాలని లేని పక్షంలో బ్యానర్లు, కటౌట్ల ఏర్పాట్లకు అనుమతించబోమని మున్సిపల్ అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయా నందరెడ్డి అనుచరులు మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఫీజులు చెల్లించి నగర వ్యాప్తంగా భారీ కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో వైకాపా అభ్యర్థిత్వంపై ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డిలు పోటీ పడుతుండటంతో నియోజవర్గ పరిధిలోని వైకాపా నాయకులు, కార్యకర్తల్లో ఆయోమయం నెలకొంది. ఈ పరిస్థితుల్లో రాయలసీమ జిల్లాల్లో సామాజిక సమీకరణలు బేరిజు వేసి మరెక్కడైనా బలిజ సామిజక వర్గానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పిస్తే చిత్తూరు నుండి ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొంత వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి సమయంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి అభ్యర్థిత్వం వైపు వైకాపా అధిష్టానం మొగ్గ చూపే అవకాశం కన్పిస్తోంది.

## భారీ వర్ష సూచన

### జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం
### కలెక్టరేట్, మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు
### కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త:
వాతావరణ కేంద్రం చిత్తూరు జిల్లాకు భారీ వర్ష సూచన చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. కలెక్టర్ హరినారాయణన్ గురువారం వర్షాలపై జిల్లా అధికార యంత్రాంగంను అప్రమత్తం చేస్తూ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలపై ప్రజలకు మరింత అప్రమత్తం చేయడానికి జిల్లా సచివాలయం, జిల్లా రెవెన్యూ అధికారి కార్యాలయం, మండల కార్యాలయాల్లో ప్రజల సహాయార్థం 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 94910 77325కు ప్రజలు వర్షాలకు ఎద్దైనా ఇబ్బందులు ఎదుర్కొంటే సమాచారం అందించాలన్నారు. అలాగే మండల కార్యాలయాల్లో అధికారులు కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి విఆర్‌ఓలు, విఆర్‌ఎలను అప్రమత్తం చేయాలన్నారు. జిల్లాలో కుప్పం డివిజన్, పలమనేరు డివిజన్, చిత్తూరు డివిజన్ గంగాధరనెల్లూరు మండలం వరకు భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశాలు వున్నాయన్నారు. ఆర్డీఓలు, తహసిల్దార్లు విపత్తు నిర్వహణలో భాగంగా పంచాయతీరాజ్, ఎస్‌పిడిసిఎల్, ఇరిగేషన్, రూరల్ వాటర్ సప్లై, పిహెచ్ ఇంజనీరింగ్, మున్సిపల్ కమీషనర్లతో సమన్వయం చేసుకొని అప్రమత్తంగా వుండాలని సూచించారు. అలాగే వరదలు సంభవించే అవకాశం వున్న ప్రాంతాల్లో ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు. అలాగే కాజ్‌వే ఓవర్ ఫ్లో కావడం, చెరువు కట్టలు తెగడం వంటివి ఎక్కడైనా జరిగితే ఇరిగేషన్ ఎస్ఇతో సమన్వయం చేసుకొని తక్షణం సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకొని చెరువుల్లో నీటి నిల్వలను పరిశీలిస్తుండాలని డిఆర్ఓను కలెక్టర్ ఆదేశించారు. అలాగే వర్షాలకు ఎలాంటి విపత్కర పరిస్థితులు సంభవించకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, పట్టు పరిశ్రమ, ఉద్యానశాఖ, పశుసంవర్థకశాఖ అధికారులు వర్షాలపై ప్రజలకు అప్రమత్తం చేయాలన్నారు.

### ఉష్ణోగ్రతలు
4/8/2022



- తిరుపతి 28 డిగ్రీలు
- చిత్తూరు 30 డిగ్రీలు
- మదనపల్లి 24 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 30 డిగ్రీలు
- వెంకటగిరి 31 డిగ్రీలు
- గూడూరు 31 డిగ్రీలు

### బంగారం ధరలు
4/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,825
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,264

### కోడిగ్రుడ్ల ధరలు
4/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00
1 డజను: రూ.60.00

# ఎన్టీఆర్ కుమార్తె మృతిపై రాజకీయం చేస్తున్న వారిపై చర్యలు

- జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కాజూరు పోలీసులకు రాజేష్ ఫిర్యాదు


చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త:



తెలుగుదేశం వ్యవస్థాపకులు, దివంగత నందమూరి తారకమారారావు కుమార్తె ఉమామహేశ్వరీ మృతిపై శవ రాజకీయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు కాజూరు రాజేష్ డిమాండ్ చేశారు. కాజూరు రాజేష్ ఆధ్వర్యంలో గురువారం చిత్తూరు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు ప్రభుతేజ, పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు అరుణ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు రాణితో కలిసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్టీఆర్ కుమార్తె వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకొంటే దీనిపై వైకాపా జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు యువరాజు, మంజూష్, హేమరాజ్, దిలీప్, గౌస్, మణి, కార్తీక్, ప్రేమకుమార్, మధు, రాజేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ఇకెవైసి ప్రక్రియ వేగవంతం చేయాలి - డిఎఒ మురళీకృష్ణ

కుప్పంరూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం కిసాన్ యోజన పథకంలో లబ్ధికి గాను రైతుల ఇకెవైసి, ఇ - పంట ప్రక్రియలను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ ఆదేశించారు. గురువారం ఆయన కుప్పంలోని భూసార పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష పరికరాలు, రసాయనాలు పరిశీలించారు. అనంతరం చెక్కునత్తం, గరిగచీనేపల్లి రైతు భరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎడిఎ అన్నపూర్ణదేవి, ఎఒ అమృతవల్లి, ఎస్‌టిఎల్ ఎఒ యామిని, ఎఇఒ శౌరంగ్, రైతులు, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## రామకుప్పంలో కుండపోత వర్షం

రామకుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త

రామకుప్పం మండలంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఎడతెరపి లేకుండా రెండు గంటలపాటు వర్షం కురిసింది. దీంతో చిన్నచిన్న కుంటలకు నీరు చేరాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో టమోటా, బీన్స్, స్వీట్ కార్న్ తదితర పంటలకు నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సాగు, తాగునీటి అవసరాలకు నీరు చేరుతోంది.

## ఘనంగా తల్లి పాల వారోత్సవాలు

పలమనేరు, ఆగస్టు 4, ప్రభాతవార్త:



పట్టణంలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బంది మానవహారం నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డా. కావ్య మాట్లాడుతూ తల్లి పాలు అమృతమని పుట్టిన పిల్లలకు గంటలోపు తప్పక పాలు పట్టించాలని, 6నెలల వరకు తప్పక పాలు పిల్లలకు పట్టించాలని దీని ద్వారా రొమ్ము కాన్సర్‌నివారిణిగాపనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ పద్మావతి, ఆరోగ్య విస్తారణాదికారి జయశంకర్, ఆరోగ్య సిబ్బంది జయలక్ష్మీ, కుసుమ, రాధ, రమేష్, రవి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనకు ప్రణాళిక

పలమనేరు, ఆగస్టు 4, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్యాభోదనకై ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు చేపడుతుందని ఎస్‌ఎ చిత్తూరు ఎపిసి వెంకటరమణరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఓఎల్‌ఎల్‌యూపి పాఠశాలలో గురువారం ఎస్‌ఏఎల్‌టి శిక్షణ కార్యాక్రమంలో భాగంగా కుప్పం, గుడిపల్లె, రామకుప్పం, శాంతిపురం, వి. కోట, బైరెడ్డిపల్లె, పలమనేరు, బంగారుపళ్యం, గంగవరం, పెద్దపంజాణి, పుంగనూరు, సోమల, చౌడేపల్లె మండలాల సిఆర్‌పి ప్రధానోపాధ్యాయులు, ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంలులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన, ఎంఇఓ లీలారాణి మాట్లాడుతూ 13మండలాల ఉపాధ్యాయులకు ఈ నెల 4 నుండి 13వరకు 9 రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. రాయలసీమ కోఆర్డీనేటర్ నాగేంద్ర, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీను బలోపేతం చేస్తాం -చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త :



నియోజకవర్గంలో పార్టీను బలోపేతం చేసి ఆదర్శంగా నిలుస్తామని తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఈమేరకు పట్టణంలోని బైపాస్‌రోడ్డులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకు ముందు పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో కార్యకర్తలు పార్టీపూర్వవైభవానికి కృషిచేయాలన్నారు. కారక్రమంలోరాజంపేట అభ్యర్థి గంటానరహరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జిల పాలనలో గాడి తప్పుతున్న పాలన

-టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

తవణంపల్లె, ఆగస్టు 4 ప్రభాతవార్త:

మండలంలో గత రెండు నెలలుగా ఇన్‌చార్జి అధికారుల పాలనలో పాలన గాడి తప్పుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ తెలిపారు. గురువారం మండల టీడీపీ నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ గత రెండు నెలలుగా రెగ్యులర్ తహశీల్దార్, ఎంపీడీఓలు లేకపోవడంతో ఆయా శాఖలకు సంభందించిన పనులు, అభివృద్ధి కుంటుపడుతున్నాయని తెలిపారు. రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో రెవెన్యూ పరమైన సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకుని రెగ్యులర్ అధికారులను నియమించాలని వారు డిమాండు చేశారు. టీడీపీ నాయకులు మధుకుమార్‌యాదవ్, వినాయకం, బాబునాయుడు, జయపాల్, మురుగ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల సొమ్ము 50వేలు మాయం.. పోలీసులకు ఫిర్యాదు

కుప్పంరూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త

మండలంలోని బంగానత్తం పంచాయతీలో పింఛన్ల పంపిణీకి సంబంధించిన నగదు యాభైవేలు మాయమైనట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూలై 31న మధ్యాహ్నం 12గంటలకు తాను వాలంటీర్లకు పెన్షన్ నగదు పంపిణీ చేసుండగా యాభైవేల రూపాయలు కన్పించకుండాపోయాయన్నారు. ఆసమయంలోఅక్కడవాలంటీర్లు, పాతకార్యదర్శిమాత్రమే ఉన్నారన్నారు. అధికారులు పైవిచారించిపెన్షన్‌నగదునుఅపహరించినవారిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## కౌన్సిలర్ చొరవతో నూతన తాగునీటి పైపులైను

కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త

కుప్పం మున్సిపాలిటీ 24వ వార్డులో మంచినీటి సమస్య పరిష్కారంకు స్థానిక కౌన్సిలర్ సయ్యద్ అలీ ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించారు. పట్టణంలోని విజయలక్ష్మి రోడ్, బాబయ్య మఠం, మునస్వామిపురం, బిసి కాలనీ, ప్రగతి లేఔట్, హెచ్‌పి బంక్ ప్రాంతాలకు కమతమూరు వద్ద నూతనంగా నిర్మించిన ఒఆర్‌హెచ్‌ఎస్ ట్యాంకు నుంచి నేరుగా నూతన పైపులైను వేసి ప్రజలకు ఇళ్లు అందేలా నూతన పైపులైనుఏర్పాటుచేశారు. దీంతోస్థానికులుకౌన్సిలర్ సయ్యద్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేతలుఎంఅలీ, అలీమ్, పళని, మహేంద్ర, మంజునాథ్, శివ, మాలిక్, కృష్ణ, సిపి మనోహర్ పాల్గొన్నారు.

## పోలీసులకు తెలుగుమహిళ..యువతనేతలచే ఫిర్యాదు

కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త

తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దేవేందర్ రెడ్డితో పాటు సోషియల్ మీడియాలో రుమార్లు చేసేవారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని తెలుగుమహిళ, తెలుగుయువత నేతలు గురువారం కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైకాపా శ్రేణులు సోషియల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఇలాంటి వారిపై ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు మణి, తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ, నేతలు స్వాతి, సుబ్బు, మంజు, పద్మమ్మ, రాణెమ్మ, తిరుమగళ్, సుందరమ్మ, పవనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీకోసం కష్టించిన కార్యకర్తలకు ఆహ్వానించరా?

కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త



వైకాపా అభివృద్ధి కోసం కుప్పంలో కష్టపడిన కార్యకర్తలకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంకు ఆహ్వానించలేదని వసనాడు మాజీ సర్పంచ్ మురళి, వైకాపా నేత మోహన్‌లు ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. కుప్పంలో తెదేపా దౌర్జన్యాలకు ఐదేళ్లు అయిందన్నారు. కుప్పంలో పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన వారికి ప్రాధాన్యత లేకపోవడం బాధాకరమన్నారు. 2024 ఎన్నికల్లో గెలుపుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి కార్యకర్తలతో సమావేశమై వారి సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారని అయితే కష్టపడిన కార్యకర్తలకు సమాచారం ఇవ్వలేదని, ఇది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో తెలియడం లేదని పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## దేశభక్తి గీతాలు ఎంతో స్ఫూర్తి

- పివికెయన్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. ఆనందరెడ్డి

చిత్తూరురూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :



జాతీయోద్యమ కాలంలో దేశభక్తి గీతాలు ఆనాటి ప్రజలకు ఎంతో ఉత్తేజాన్ని, స్ఫూర్తిని కలిగించిందనీ పివికెయన్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. ఆనందరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పివికెయన్ కళాశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవాలలో భాగంగా దేశభక్తి గీతాల పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ అధ్యక్షతన కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ డా. ఎస్. బేనజీర్ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వేల్ఫేర్ ఆఫీసరునాగేశ్వరరావు, బిసి వెల్ఫేర్ ఆఫీసర్లు జ్యోత్స్న, రాజశేఖర్, కళాశాల అధ్యాపకులు డా. ఎస్. శశికళ, డా. శివరాగిణి, డా. మోహన్‌బెహరా, శ్రీవిద్య, భానుప్రకాష్, మునెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైకాపా పాలనలో పన్నుల భారం

బంగారుపాళ్యం, ఆగస్టు 4 ప్రభాతవార్త:

వైఎస్‌ఆర్‌సిపి పరిపాలనలో ప్రజలపై పన్నుల భారం భారీగా వుందని మండల టిడిపి అధ్యక్షుడు ఎన్‌పి జయప్రకాష్ పేర్కొన్నారు. గురువారం బాదుడే బాదుడు కార్యక్రమంను తుంబకుప్పం, పెరుమాళ్ళపల్లి గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో రూపొందించిన కరపత్రాలను ఇంటింటికి వెళ్ళి ఆయన పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వైకాపా ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి కార్యదర్శి జనార్ధన్, మండల తెలుగు యువత అధ్యక్షుడు రమేష్, మాజీ అధ్యక్షుడు గిరిబాబు, టిడిపి నాయకులు కోకా ప్రకాష్‌నాయుడు, హరిప్రసాద్, రాజేంద్రనాయుడు, లోకనాథంనాయుడు, పూర్ణచంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో బిసీ నాయకుల నిరసన

బంగారుపాళ్యం, ఆగస్టు 4 ప్రభాతవార్త:



న్యూఢిల్లో జంతర్ మంతర్ వద్ద జాతీయ బిసీ సంక్షేమ సంఘ నాయకులు నిరసన చేపట్టారు. గురువారం జాతీయ బిసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. బిసీలకు 50 శాతం చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో బిసీలకు 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ర్యాలీలో రాష్ట్రం నుండి వందలాది మంది పాల్గొనగా జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్న కుమార్, మునిరత్నం, నారాయణస్వామి, శంకరయ్య, సుబ్రమణ్యం, చెంగమనాయుడు పాల్గొన్నారు.

## సోషల్ మీడియాలో వైసిపి శవరాజకీయం

చిత్తూరురూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త :

సోషల్ మీడియా వేదికగా స్వర్గీయ ఎన్టీఆర్ కుమార్తె ఉమామహేశ్వరి మరణంపై శవరాజకీయాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డిఐజికి లేఖ రాసినట్లు చిత్తూరు నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రభుతేజ పేర్కొన్నారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీరామారావు చిన్నకుమార్తె ఉమామహేశ్వరీ మరణాన్ని కూడా వైకాపా రాజకీయాలకు వాడుకోవడం చాలా నీచమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. అనారోగ్య కారణాలే దీనికి కారణమంటూ స్వయంగా ఉమామహేశ్వరి కుమార్తె పోలీసులకు తెలిపారన్నారు. విద్యార్థినాయకులుమధు, సర్దార్, రామక్రిష్ణ, బాలాజీ, ప్రేమ్‌కుమార్, నాగరాజుపాల్గొన్నారు.

## సప్తగిరి బ్యాంకుచే ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

తవణంపల్లె, ఆగస్టు 4 ప్రభాతవార్త:

సప్తగిరి గ్రామీణ బ్యాంకు అందిస్తున్న సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని అరగొండ బ్రాంచి మేనేజర్ ఎస్. శివమానందరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పత్రపల్లె గ్రామంలో అరగొండసప్తగిరి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో అవార్డు కళాజాతా బృందం వారిచే ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈమేరకు కళాజాతా ద్వారా తమ ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్‌ల పంపిణీ

తవణంపల్లె, ఆగస్టు 4 ప్రభాతవార్త:

మండలంలోని ముగ్గురు వ్యక్తులకు సీఎం సహాయనిధి నుండి ఆర్థికసాయం చెక్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈమేరకుపట్నందళితవాడకుచెందినఎం. వాసుకు 26 వేలు, తెల్లగుండ్లపల్లెకు చెందిన ఎం. కుమార గిరినాయుడుకు 36 వేలు, తడకరకు చెందిన జి. రెడ్డిదేషిక్‌కు 24 వేల రూపాయల ఆర్థికసాయం మంజూరైంది. ఈచెక్‌లను ఎంపీడీఓ ఎం. హరిప్రసాద్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సిద్ధపంల్లె హరిరెడ్డి, వైకాపా నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, బాబురెడ్డిలు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో అందజేశారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట, కోట, వెంకటగిరి, బాలాయపల్లి దొరవారిసత్రం,

## పట్టుబడ్డ వాహనాలు వేలం

సూళ్లూరుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త

సూళ్లూరుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం వేలంపాటలు నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్ఈబీ సీఐ సూర్యనారాయణ గురువారం తెలిపారు. మొత్తం 35 వాహనాలకు సంబంధించి వేలంపాట నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు 10 శాతం ధరావత్తు రుసుము చెల్లించాలని సీఐ కోరారు.

## రవీంద్రభారతిలో సామూహిక అక్షరాభ్యాసం

సూళ్లూరుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని రవీంద్రభారతి హైస్కూల్‌లో చిన్నారి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేసే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రవీణ్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బాలాజీ ఆర్థోకేర్ ఆసుపత్రి వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం

కోట, ఆగస్టు 4 ప్రభాతవార్త



కోట పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. కోటలో వివిధ వ్యాపారసంస్థలు, ఆసుపత్రులతో విస్తరిస్తోంది. ఈ అభివృద్ధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సంస్థలు, వ్యాపార కేంద్రాలు ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. కోట పట్టణం వాకాడు, కోట, చిట్టమూరు, ఓజిలి మండలాలకు కూడలిగా, వ్యాపార కేంద్రంగా మారడంతో ఇక్కడ నుంచి ప్రైవేటు కంపెనీల వాహనాలు నిత్యం ప్రయాణిస్తుంటాయి. జీవీఆర్, డెక్కన్ పెయింట్స్, శ్రీసిటీ, మేనకూరు సెజ్‌లకు వాహనాల్లో వందలాది మంది ఉద్యోగులు ప్రతి నిత్యం ప్రయాణించడం జరుగుతోంది. కోట క్రాస్‌రోడ్డు నుంచి కొత్త చెరువు వరకు నిత్యం రద్దీగా మారింది. కొత్తగా నిర్మించే భవనాలకు పార్కింగ్ స్థలాలు చూపించకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీ అధికారులు మామూళ్లకు ఆశపడి అడ్డగోలుగా నిర్మాణాలకు అనుమతులిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

-ఏపిఐఐసి అధికారులకు ఎమ్మెల్యే వినతి

గూడూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త



గూడూరు గాంధీనగర్ ప్రాంతంలో ఏపిఐఐసి, పరిశ్రమలశాఖ ద్వారా ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజయవాడలోని ఏపిఐఐసి బిల్డింగ్‌లో ఇడి జి. రాజేంద్రప్రసాద్, వైస్‌ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం ఐఏఎస్‌లను గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు విన్నవించారు. గతంలో పరిశ్రమలశాఖ మంత్రిగా పనిచేసిన దివంగత మేకపాటి గౌతంరెడ్డి కూడా ఆటోనగర్ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుత పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ దృష్టికి కూడా ఆటోనగర్ ఏర్పాటు విషయమై చర్చించామని తెలిపారు. అధికారుల సహకారంతో త్వరలో ఆటోనగర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆటోనగర్ ఏర్పాటుతో గూడూరు పట్టణంలో ఉన్న మెకానిక్‌షాపులు, టింబర్ డిపోలు, పాతసామాను దుకాణాలు ఆటోనగర్‌కు తరలివెళతాయన్నారు. గూడూరుకు త్వరలోనే ఆటోనగర్ వచ్చేందుకు అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశభావం వ్యక్తం చేశారు.

# చదువుల తల్లి పిలుస్తోంది

- శతాబ్ది ఉత్సవాలకు ముమ్మర సన్నాహాలు
- 14న అపూర్వ సమ్మేళనం

సూళ్లూరుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త



ఎందరో శాస్త్రవేత్తలు, మరెందరో డాక్టర్లు, ఇంజనీర్లు, కళాకారులు, రాజకీయ నాయకులు, వ్యాపార, పారిశ్రామికవేత్తలు.. ఎన్నో రంగాల్లో విశేషంగా రాణిస్తున్న మరికొందరు. ఇలా ఎంతోమందికి అక్షరదానం చేసి నేటికీ చిరంజీవిగా విరాజిల్లుతున్న చదువుల తల్లి పండుగ చేసుకుందాం రా అని పిలుస్తోంది. ఆ చదువుల తల్లి ఎవరో కాదు. సూళ్లూరుపేట పట్టణ నడిబొడ్డులో 10 ఎకరాల స్థలంలో విస్తరించి ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల. 1920 ఆగస్టు 2వ తేదీ దాత కళత్తూరు వీరాస్వామిరెడ్డి దాతృత్వంతో ఇచ్చిన స్థలంలో ప్రారంభమైంది ఈ ఉన్నత పాఠశాల. అంచలంచెలుగా అభివృద్ధి చెందింది. ఉన్నత పాఠశాలకు నూరేళ్లు నిండితే, దీనికి అనుసంధానంగా ప్రారంభమైన జూనియర్ కళాశాలకు 50 ఏళ్లు నిండాయి. ఈ చదువుల తల్లి అక్షరదానం అంతటితో ఆగిపోలేదు. 80 దశకంలో మరోసారి తమ బిడ్డలకు విద్యాబుద్ధులు అందించాలన్న మమకారం పెంచుకొని డిగ్రీ కళాశాలను ప్రారంభించేందుకు కేంద్ర బిందువైంది. చదువుల తల్లి ఒడిలో చదివిన ప్రముఖులు, మాజీ ఆర్‌బీఐ గవర్నర్, ఒరిస్సా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం. రామకృష్ణయ్య, షార్ మాజీ డైరెక్టర్ కాటూరి నారాయణ, షార్ కంట్రోలర్‌గా పనిచేసిన జేవీ రాజారెడ్డి, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.. ఇలా విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ఈ చదువుల తల్లి బిడ్డల జాబితా చెప్పుకుంటూ పోతే చాలా ఉంది. ఇక ఉపాధ్యాయ రంగానికి వస్తే.. ఈ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన దిగ్గజ సినీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాసరావు పేరుంది. ఈ నేపథ్యంలో గతంలో ఉన్నత పాఠశాల శిథిలావస్థకు చేరుకున్నప్పుడు అప్పటి ఇస్రో ఛైర్మన్ కె. కస్తూరిరంగన్ రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. అప్పటి డైరెక్టర్ కె. నారాయణ చొరవ తీసుకొని పాఠశాల పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు రూ. 25 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో బ్రిటీష్ హయాంలో ప్రారంభమైన ఉన్నత పాఠశాల ఏ విధంగా ఉందో అలాగే అదే రూపులో తిరిగి పునఃవైభవం తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ చదువుల తల్లి నూరేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. ఇందుకు ఈ తల్లికి ఘనంగా ధన్యవాదాలు తెలిపేందుకు పూర్వపు విద్యార్థులందరూ కమిటీగా ఏర్పడి ఆగస్టు 14వ తేదీన అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నారు.

## ఆలయాల నిర్మాణానికి గ్రామస్తులచే భూమిపూజ

బాలాయపల్లి ఆగస్టు 4 ప్రభాతవార్త



మండలంలోని యాచవరం గ్రామంలో గురువారం ఆలయాల నిర్మాణానికి వేదపడింతులు గ్రామస్తుల చేత భూమి పూజలను చేయించారు. కోదండరామ స్వామి, కాశీవిలాక్షిసమేత విఘ్నేశ్వర స్వామి, శిరిడిసాయిబాబ ఆలయాల నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమి పూజలను నిర్వహించారు. వేదపండితులు సుందరాజన్ ప్రత్యేక పూజలు, కలశస్థాపన, తదితర పూజలను నిర్వహించారు. ఎక్కడలేని విధంగా ఆలయాలు ఒకే ప్రాంగణంలో నిర్మిచడంపట్ల గ్రామస్తులు హర్షిస్తున్నారు.

## ఇసుక అక్రమరవాణా, నాటు సారా విక్రయాలు జరిపితే

టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయండి :ఎస్ఈబి సిఐ

వెంకటగిరి ఆగస్టు 4 ప్రభాతవార్త



నాటుసారా విక్రయాలు, ఇసుక అక్రమ రవాణా, గుట్కాల విక్రయాలు తదితరవి జరుగుతుంటే టోల్ ఫ్రీ నంబర్14500 ఫోన్ చేయాలని ఎస్ఆబి ఇన్స్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టోల్ ఫ్రీనంబర్‌కు ఫోన్ చేసిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. 9440902517 ఫోన్ నంబర్‌కూడా ఫోన్ చేయవచ్చునని తెలిపారు. వెంకటగిరి. డక్కిలి, బాలాయపల్లి మండలాల ప్రాంతాల్లో అక్రమ రవాణాపై సమాచారం ఇవ్వవచ్చునని తెలిపారు. తాను బాధ్యతలు చేపట్టి సంవత్సరం రోజులైన సందర్భంగా నాటుసారా, అక్రమంగా మద్యం విక్రయాలను అణిచి వేసినట్లు తెలిపారు. పలువురిపై కేసులు నమోదుచేసినట్లు వివరించారు.

## ఏజిపిగా భాస్కరరెడ్డి నియామకం

పుంగనూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త :



స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు ప్రభుత్వసహాయ న్యాయవాదిగా ఎస్. భాస్కరరెడ్డి నియమితులయ్యారు. పట్టణానికి చెందిన భాస్కరరెడ్డి మూడుదశాబ్దాలుగా న్యాయసేవలందిస్తున్నారు. ఈయన సేవలను గుర్తించిన న్యాయవిభాగం ఆయనకు ప్రభుత్వం తరఫున న్యాయవాదిగా సేవలందించే అవకాశం కల్పించింది. ఆయన నియామకం పట్ల పలవురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దేశనాయకుల సేవలు స్మరించుకుందాం

పుంగనూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త :



జాతికి దాస్యశృంఖనాల నుంచి విముక్తి కల్పించి జీవితాలను ఉరికంబాలకు, తుపాకీగుళ్ళకు బలిచేసిన ఎందరో మహానుభావుల సేవలు భారతీయ పౌరులు గుర్తించుకున్నారని, అందుకే వారికి ప్రతినిత్యం నివాళి అర్పించేందుకు ప్రభుత్వం ఆజాదీ అమృత్ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎంఇఓ కేశవరెడ్డి అన్నారు. బుధవారం మంగళం ప్రాథమికోన్నత పాఠశాలలో ఇండియన్‌బ్యాంకు అధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎంపిటిసి రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ రాజారెడ్డి, బ్యాంకు సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

# పంటకోత ప్రయోగాలపై వీఏఏ లకు శిక్షణ

చిట్టమూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త:



ఖరీఫ్ 2022 సంబంధించిన పంటకోతల ప్రయోగాల నిర్వహణపై ఏఎస్‌వో ఎస్. కె. మస్తాన్‌బాబు వ్యవసాయ సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గురువారం చిట్టమూరు మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో స్థానిక వ్యవసాయ అధికారి సుచేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్‌వో మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులందరూ పంట కోత ప్రయోగాలను నిబంధనలకు లోబడి నిర్వహించాలని సూచించారు. ప్రయోగాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావివ్వకుండా జరపాలన్నారు. ఇందుకు సంబంధించి వీఏఏలకు సీసీ యాప్‌లను వారి ఫోన్లలో నమోదు చేయడంతో పాటు వారికి అవసరమైన పాస్‌వర్డ్, యూజర్ నేమ్‌లను అందించారు. మండలంలోని 41 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి ఖరీఫ్‌లో 10 రెవెన్యూ గ్రామాల్లో ఈ పంట కోత ప్రయోగాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎల్లసిరి, పెళ్లకూరు, గునపాడు, మెట్టు, యాకసిరి, చిట్టమూరు, ఈశ్వరవాక, గునపాటిపాళెం గ్రామాల్లో ప్రయోగాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు.

వ్యవసాయ అధికారి సుచేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆయా గ్రామాల పంట దిగుబడిని అంచనా వేసేందుకు పంట కోత ప్రయోగాలు తలమానికం కానున్నాయని, వీఏఏలు అందరూ వీటిపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఆగష్టు 4 ప్రభాతవార్త: అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. తిరుమల బైపాస్ రోడ్డులో మున్సిపల్ పార్కు వద్ద తాత్కాలిక భవనంలో ఏర్పాటు చేస్తున్న కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను గురువారం అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు గురించి అధికారులు కమిషనర్‌కు వివరించారు. ఈ సెంటర్‌ను త్వరలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. కంట్రోల్ సెంటర్ ద్వారా నగరంలో చెత్త సేకరణ ఏ విధంగా జరుగుతుంది, పారిశుద్య కార్మికుల హాజరు, ట్రాఫిక్ నియంత్రణ, యూజర్ చార్జీలు, నీటి సరఫరా విధానం, గాలి కాలుష్య నియంత్రణ, నగర ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం వంటివి ఈ సెంటర్ ద్వారా తెలుసుకోవచ్చునని తెలిపారు. ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని దేశంలో 100 స్మార్ట్‌సిటీల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లు పని చేస్తాయని తెలిపారు. ఎక్కడికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించనున్నారని తెలిపారు. త్వరితగతిన కంట్రోల్ పనులు పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.

## భరత్ గారూ.. మీతో చర్చకు లోకేష్ వద్దు.. మా కార్యకర్తలు చాలు : తెదేపా



కుప్పంరూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త : తెదేపా, వైకాపాల మేనిఫెస్టోలపై చర్చకు ఎమ్మెల్సీ భరత్ తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు సవాల్ విసిరారని అయితే ఎమ్మెల్సీతో బహిరంగ చర్చకు తమ పార్టీ కేడర్, కార్యకర్తలు చాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పంను అభివృద్ధి చేయలేదని వైకాపా నేతలు ఊతపదంగా మాట్లాడుతున్నారని కుప్పాన్ని చంద్రబాబునాయుడు ఎలా అభివృద్ధి చేశారో కుప్పం ప్రజలకు బాగా తెలుసన్నారు. కుప్పం ప్రాంతంలో రైతులను ఆదుకునేందుకు పాలారు నదిపై చెక్‌డ్యాములను నిర్మించారన్నారు. ప్రజలకు స్వచ్ఛ జలాలు అందించేందుకు ఎన్టీఆర్ సుజల పథకం ప్రవేశపెడితే దాన్ని పేరుమార్చినా ప్రజలకు ప్రయోజనం కలగడం లేదని విమర్శించారు. కుప్పం మండలం కనకనాశమ్మ ఆలయంను గతంలో 3కోట్లతో అభివృద్ధి చేశామని నేడు వైకాపా నేతల బ్యానర్లతో ఆలయ ప్రాంగణం నింపేసారని సొమ్మొకడిది సోకొకరిది అన్న రీతిలో వైకాపా నేతలు వ్యవహరిస్తున్నారన్నారు. కుప్పంలో వైకాపా నీచ సంస్కృతికి దిగిందన్నారు. అధికారంలో వచ్చిన మూడేళ్లలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. 90శాతం పూర్తయిన హంద్రీ-నీవా కాలువ పనులను ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. కాలువ పనులపై దివంగత చంద్రమౌళి కోర్టు కేసులు వేయించారన్నారు. కుప్పంలో బిసి కమ్యూనిటీ హాళ్లను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఈ మూడేళ్ల కాలంలో ఎంత అభివృద్ధి చేశారో తాము బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కోడికత్తి కేసుతో సిఎం జగన్‌రెడ్డి అధికారంలో వచ్చారని విమర్శించారు. అమరావతి రాజధాని కోసం అక్కడి రైతులు 30వేల ఎకరాల భూములు కేటాయిస్తే కేవలం కమ్మ సామాజిక వర్గం కోసమే రాజధాని అంటూ సిఎం జగన్‌రెడ్డి అమరావతిని విచ్ఛిన్నం చేశారన్నారు. బలిజలకు కాపునేస్తం అంటూ ఆకర్ష లబ్ధి కలిగించారన్నారు. ద్రవిడ వర్సిటీలో అక్రమ మైనింగ్ జరుగుతుంటే ఎమ్మెల్సీ భరత్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికలు మరలా ఎప్పుడు జరిగినా మరలా చంద్రబాబు సిఎం కావడం తథ్యమన్నారు. ఈసమావేశంలో చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు సాంబశివం, సత్యేంద్రశేఖర్, త్రిలోక్, శాంతారాం, మంజునాథ్, మణి, రామచంద్ర, ఆర్ఆర్ రవి, ఎవి రవి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సైంధవ రథోత్సవం



పుత్తూరురూరల్, ఆగస్టు 4 ప్రభాతవార్త:పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజస్వామి తిరుణాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం 9 గంటలకు ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఏ.వి.సుభాష్ ఉయభదారుగా వ్యవహరించారు. అలాగే సాయంత్రం 4 గంటలకు సైంధవ రథోత్సవం, పల్లకి ఉత్సవం, ఆనంగి జయమ్మ కీర్తిసుశేషులు ఆనంగి కృష్ణయ్య కుమారులు, సాయిరాం బిల్డర్స్(బెంగళూరు) ఆనంగి రవిబాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆనంగి ఆనంద్, రాత్రి హంస వాహనంపై అమ్మవారిని, స్వామివారిని ఊరేగించారు. కీర్తి శేషులు బియ్యం చిన్నబ్బ మేస్త్రి కుమారుడు కీర్తి శేషులు బి.సి.రాజా, మాజీ కౌన్సిలర్ శ్రీ ద్రౌపదీ సమేత దేవస్థానం పుత్తూరు వారి కుటుంబ సభ్యులు, మాజీ చైర్మన్ బి.ఆర్.యుగంధర్, బిల్డింగ్ కాంట్రాక్టర్ బి.ఆర్.మురళి ఆధ్వర్యంలో రాత్రి సింహ వాహనం, ఆర్.నాథముని(పైడిపల్లి) ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

**నేడు ఆలయంలో...**

శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుస్వామి తిరుణాల సందర్భంగా 5వ తేదీ శుక్రవారం ఉదయం నందీసేవ, మధ్యాహ్నం అన్నదానం, రాత్రి రైల్వేస్టేషన్ వద్ద పాటకచ్చేరి, వరలక్ష్మీదేవి, ద్రౌపదీదేవి అమ్మవారి విమానపు మహోత్స వం, ఊరేగింపు కార్యక్రమం, అలుగు ఉత్సవం కార్యక్రమాలు జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో నేడు వరలక్ష్మీవ్రతం




తిరుపతి,ఆగస్టు 4ప్రభాతవార్త: శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీవ్రతం సందర్భంగా నేడు తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ప్రత్యేకంగా వరలక్ష్మీవ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ ఎం.ముని కృష్ణయ్య తెలిపారు. వరలక్ష్మీవ్రతం సందర్భంగా అమ్మవారికి బంగారు ముఖబింబం, బంగారు వజ్రకిరీటంతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించడం జరుగుతుంది. సామూహిక వరలక్ష్మీవ్రతంలో పాల్గొనదలచిన భక్తులు ఆలయంలోని కౌంటర్‌లో 151రూపాయలు చెల్లించి టిక్కెట్ పొంది పూజలో పాల్గొనాలని కోరారు.

## వరసిద్ధుని సేవలో సినీ నిర్మాత దిల్‌రాజు

కాణిపాకం, జూలై 4 ప్రభాతవార్త: ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేద మంపడ పంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదా లను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. ఆయన వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.


## 377 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి : కలెక్టర్

చిత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త: జిల్లాలో 377 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. వెలగపూడి నుండి గురువారం సిసిఎల్ఎ ప్రధాన కమీషనర్ సాయిప్రసాద్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష, మ్యూటేషన్లు, బియాండ్ ఎస్ఎల్ఎలపై కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో సిసిఎల్ఎ ప్రధాన కమీషనర్ మాట్లాడుతూ మ్యూటేషన్లలో చేయాల్సిన మార్పులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే బియాండ్ ఎస్ఎల్ఎలో వున్న వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ద్వారా భూ వివాదాలకు పరిష్కారం లభిస్తుందని దశాబ్దాలుగా నెలకొన్న భూ సమస్యలను పరిష్కారం చేయడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమంను చేపట్టిందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ జిల్లాలో 822 గ్రామాలకు గాను 377 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. గ్రౌండ్ వాలిడేషన్‌కు సంబంధించి 34 గ్రామాల్లో అధికారులు ప్రస్తుతం చేస్తున్నారని వివరించారు. అలాగే 16 గ్రామాల్లో వాలిడేషన్ పూర్తయి రికార్డుల తయారీ స్థాయిలో వుందన్నారు. అలాగే గ్రౌండ్ ట్రుథింకింగ్ 115 గ్రామాల్లో పూర్తి అయ్యిందని మరో 29 గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతుందని కలెక్టర్ సిసిఎల్ఎ ప్రధాన కార్యదర్శికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, సర్వే ఎడి తదితరులు పాల్గొన్నారు.

## వీడిన బాలికల అదృశ్యం 'మిస్టరీ'

కోట, ఆగస్టు 4 ప్రభాతవార్త : కోట ప్రాంతానికి చెందిన ఒక బాలిక, కర్నూలు జిల్లాకు చెందిన మరో బాలిక గత నాలుగురోజుల క్రితం అదృశ్యమయ్యారు. ఆ మేరకు ఆ బాలికల తల్లిదండ్రులు కోట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులకు ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. ఈ ఇద్దరు బాలికలు ఎక్కడికి వెళ్లారు, ఎలా వెళ్లారనే విషయంపై తర్జనభర్జన పడ్డారు. కోట ప్రాంతంలో సీసీటీవీ ఫుటేజ్‌లు ఆధారంగా కేసును ఛేదించాలని వాకాడు సీఐ హరికృష్ణ ఈ కేసును ఓ ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఆ క్రమంలో విద్యార్థులు వాడిన సెల్‌ఫోన్ కాల్ డేటా సిగ్నల్స్ ఆధారంగా వెంట వెంటనే సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఎస్ఐ జి.పుల్లారావుతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి హైదరాబాద్ ప్రాంతానికి పంపించారు. మహబూబ్ నగర్ జిల్లా నాగర్ కర్నూల్‌లో ఈ విద్యార్థినులు ఓ దగ్గర ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో అడుగడుగునా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ వారి దగ్గరకు ఎస్ఐ జి.పుల్లారావు చేరుకున్నారు. అక్కడ నుంచి ఆ బాలికలను గురువారం కోట పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఉద్యోగాల్లో చేరాలని ఓ వాట్సాప్ గ్రూపు ద్వారా సమాచారం తెలుసుకొని హైదరాబాద్‌కు వెళ్లారని సీఐ హరికృష్ణ తెలిపారు. సీఐ హరికృష్ణ, ఎస్ఐ పుల్లారావును శ్రమించి బాలికల అదృశ్యం కేసును ఛేదించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ద్రవిడ వర్సిటీలో అఖిల పక్ష నేతల ధర్నా



కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త: ద్రవిడ విశ్వవిద్యాలయంలో గురువారం కుప్పంకు చెందిన అఖిలపక్ష నేతలు, సామాజిక వేత్తలు ధర్నా నిర్వహించారు. బుధవారం వర్సిటీ విసి ఆచార్య తుమ్మల రామకృష్ణ విలేకరుల సమావేశంలో కుప్పం ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా ప్రసంగించారని అఖిలపక్ష నేతలు మండిపడ్డారు. విసి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కుప్పం ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వర్సిటీ విసి కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం విసి అక్కడకు చేరుకుని తాను కుప్పం ప్రజల గురించి తప్పుగా మాట్లాడలేదని తాను చేసిన వ్యాఖ్యలు బాధ కలిగించి ఉంటే అందుకు వెనక్కు తీసుకుంటున్నానని అఖిలపక్ష నేతలతో చెప్పారు. కుప్పం ప్రజలంటే తనకు ఎంతో గౌరవమని తాను కూడా ఈ ప్రాంతానికి చెందినవాడిననేనన్నారు. అనంతరం అఖిలపక్ష నేతలు అక్కడనుంచి వెనుతిరిగారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నేత గోపీనాథ్, సామాజికవేత్తలు మునస్వామి, శివశంకర్, బిజెపి రాష్ట్ర నేత శివశంకర్, నేతలు పివి ఉపేం ద్రకుమార్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్, తెలుగుయువత అధ్యక్షుడు మణి, బాస్ నేత గణేష్, నవీన్, నరేంద్ర, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షంతో పడిపోయిన పైరు పరిశీలన

**- వార్త ప్రభావం**



తడ, ఆగస్టు 4 ప్రభాతవార్త : భారీవర్షంతో నేలకొరిగిన వరి పైరును వ్యవసాయ శాఖ సిబ్బంది పరిశీలించారు. తడ మండలంలోని పాముల కాల్వ సమీప గ్రామాల్లో కోత దశకు చేరుకున్న వరిపైరు భారీవర్షాలకు దెబ్బతిని పడిపోయిన వైనాన్ని 'వార్త' దినపత్రికలో గురువారం వచ్చిన కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. సూళ్లూరుపేట ఏడీ, తడ ఏవోల ఆదేశాలతో మాంబట్టు ఆర్‌బీకే అగ్రికల్చర్ అసిస్టెంట్ శివ గురువారం వెండ్లూరుపాడు గ్రామానికి వెళ్లి నేరుగా పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలిచ్చారు. వెండ్లూరుపాడు, సమీప గ్రామాల్లో వరిపైరు నీళ్లలో పడిపోయిన దృశ్యాలను ఆయన చూశారు. అధికారుల ఆదేశాల మేరకు 100 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పు కలిపిన ద్రావణాన్ని పడిపోయిన పైరుపై పిచికారి చేస్తే మొలకలు వచ్చే ప్రమాదం ఉండదని వ్యవసాయ సిబ్బంది రైతులకు తెలిపారు. ఇదిలావుంటే గురువారం కూడా ఆయా గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో పంట కోసుకునే దశలో వరుణుడి ప్రభావం తమకు తీరని నష్టం కలిగిస్తుందని రైతులు భయపడుతున్నారు. ధాన్యం రంగు మారితే గిరాకీ తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులు నేరుగా ఈ గ్రామాలను సందర్శించే అవకాశం ఉంది.

## బాలాలయ స్థాపన పూజలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న కనకా చలంపై వెలసిన దుర్గామాత ఆలయంలో జీర్ణోద్ధారణ, కుంభాభిషేకం జరుపుటకు నిర్ణయించారు. సుమారు రూ.3కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో ఆలయాన్ని తీర్చి దిద్దుటకు ప్రణాళికలు రూపొంది ంచారు. సెప్టెంబర్ 5న మహాకుంభాభిషేకం నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ మేరకు ఇక్కడ బాలాల య స్థాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయం వద్ద భారీ ఎత్తున ఏర్పాట్లు చేసారు. హోమాలు నిర్వహించారు. కలశస్థాపన జరిపారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్యఅతిధిగా విచ్చేసారు.ఆలలయ అర్చకులు,వేదపండితులు సంకల్ప పూజలు నిర్వహించి కలశ పూజలు జరిపారు. విశేష హోమ పూజలు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి నిర్వహించి దూపదీప నైవేద్యాలు నివేదించారు. ఈ బాలలయ పూజల్లో అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్, వర్క్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, సబ్ టెంపుల్స్ ఇన్‌చార్జి లక్ష్మయ్య, స్థపతి కుమార్, అర్చకులు నిరంజన్ గురుకుల్, సురేష్ గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి,నీలకంఠ గురుకుల్, దక్షిణామూర్తి, తులసీ శర్మ, రాకేష్ శర్మ తదితరులు హాజరయ్యారు.

## పురవీధుల్లో ఊరేగిన రేణుకమ్మ తల్లి



రేణిగుంట, ఆగస్టు 4 ప్రభాతవార్త: రేణిగుంట మండలం దిగువమల్లవరం అరుంధతివాడలో కొలువు తీరిన శ్రీశ్రీశ్రీ రేణుకామాత 60వ వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా గురువారం అమ్మతల్లి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. రెండో రోజు అమ్మవారిని ఉదయం సుప్రభాతసేవతో మేల్కొలిపి విశేష పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యే కంగా అలంకరించి ఆమె సమక్షంలో శ్రీ పోతురాజుల కథను భక్తులకు వినిపించారు. ఎదురు గుమ్మాల కార్యక్రమాన్ని కనుల పండువగాచేశారు. అమ్మవారిని చిత్తూరు అసిస్టెంట్ మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ గాయత్రి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆమెను ఆలయ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు పురవీధుల్లో భాజ భజంత్రీలు, బాణాసంచా వేడుకలతో సాగింది. బ్రహ్మోత్సవ నిర్వాహకులు మర్దాల రవిబాబు, చెంగయ్య, చిన్నయ్య, సుబ్రహ్మణ్యం, రమేష్ తదితరులు భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


## నూతన ధ్వజస్థంభం ప్రతిష్ట విజయవంతం

**-ఆలయ చైర్మన్, ఈఓలు**



కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ప్రధాన ఆలయంలో గురు వారం జరిగిన నూతన ధ్వజస్థంభం ప్రతిష్ట విజయవంతం అయినట్లు ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్ బాబులు తెలిపారు గురువారం వారు ఈఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ ఆలయంలో ఉదయం అనుకున్న సమయానికి దిగ్విజయంగా నూతన ధ్వజస్థంభం ప్రతిష్ట అందరి సహకారంతో నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమం సందర్భంగా ఉదయం 7 గంటల నుండి 11.30 గంటల వరకు భక్తులకు స్వామివారి దర్శనం నిలిపివేసినట్లు తెలిపారు. అలాగే ఈనెల 21న ప్రధాన ఆలయ చతుర్వేద సహిత మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఈనెల 15 నుండి 21 వరకు వైదిక కమిటీ సూచనల మేరకు ఆలయంలో జరిగే అన్ని రకాల ఆర్జితసేవలను పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ బంగారు కిరీటానికి భారీ విరాళం



వెంకటగిరి ఆగస్టు 4 ప్రభాతవార్త : వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మకు బంగారు కిరీటం,ఆభరణాల తయారికి జిల్లా మాజీ సెంట్రల్ బ్యాంకు చైర్మన్, వైసిపి నేత మెట్టుకూరు ధనుంజయరెడ్డి గురువారం ఐదు లక్షలా ఐదువేల రూపాయలను విరాళంగా ఇచ్చారు. మాజీమంత్రి, ఎంఎల్ఎ ఆనం రామ నారాయణరెడ్డి పోలేరమ్మ అమ్మవారికి కొన్ని దశాబ్దాలుగా బంగారు కిరీటం, ఆభరణాలు లేకపోవడంతో ఆయన అమ్మవారికి వీటిని తయారు చేయించాలని తలపెట్టారు. దీంతో స్పందించిన దాతలు తగు సహాయాన్ని అందిస్తున్నారు. ఇందులో భాగంగా వైసిపి నేత ధనుంజయరెడ్డి భారీగా విరాళాన్ని ఇచ్చారు. ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఐదులక్షలా ఐదువేల రూపాయల చెక్కును ఆలయ కమిటీవారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పద్మసాలే కార్పొరేషన్ డెక్టర్ నక్కా వెంకటేశ్వర్లు, వైసిపి జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, న్యాయవాదుల సంఘం కార్యదర్శి లక్కమనేని కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు వెలిక ఒటి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంకాల పరమేశ్వరీ అమ్మవారి సేవలో ఎమ్మెల్యే



నారాయణవనం, ఆగస్టు 4 ప్రభాతవార్త: మండలంలోని పాలమంగళం ఉత్తరప్ప కండ్రిగలో గ్రామ దేవత అంకాల పరమే శ్వరీ అమ్మవారి ఉత్సవాలు జరుగుతున్నాయి. గురువారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలను ఆలయ పెద్దలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కె.సాయిరవి, ప్రేమలతకుప్పస్వామి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 10న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటి సమావేశం

కాణిపాకం, ఆగస్టు 4 ప్రభాతవార్త: సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర ్భంగా చేపట్టవలసిన ఏర్పాట్లుపై ఈనెల 10న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉభయదారులతో సమన్వయ కమిటి సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎంవి.సురేష్‌బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన స్థానిక ఈఓ కార్యాలయం సమావేశ మందిరంలో జరిగే సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

## శివయ్య సేవలో వ్యవసాయ మిషన్



శ్రీకాళహస్తి,ఆగస్టు 4 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతిగాంచిన శ్రీకాళహస్తీశ్వ రాలయంలో భక్తుల తాకిడి పరిమితంగా ఉంది.ఆషాఢ మాసం కాబట్టి భక్తుల రద్దీ పరిమితంగా ఉంది అయితే అతిధుల తాకిడి పెరుగుతుంది.ఈ నేపధ్యంలో గురువారం ఎపి రాష్ట్ర అగ్రికల్చరల్ మిషన్ వైస్ చైర్మెన్ ఎం.వి.యస్ నాగిరెడ్డి కుటుంబసభ్యులతో శివయ్య సేవలకు వచ్చారు.కృష్ణాజిల్లా నందివాడ మండలం జనార్ధనపురానికి చెందిన నాగిరెడ్డి కుటుంబసభ్యులతో రాగా వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేదపండితులతో మేళ తాళాలతో స్వాగతం పలికారు. వారికి ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శనం ఏర్పాట్లు చేసారు. దర్శనం తరువాత వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు,స్వామి అమ్మవార్ల తతీర్థ ప్రసాదాలను అందించారు.

## జోరుగా ఇసుక రవాణా అక్రమ దందా

**- స్పందించిన జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్**

**- రంగంలోకి దిగిన రెవెన్యూ, పోలీసు అధికారులు**



పాలసముద్రం, ఆగస్టు 4 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం వనదుర్గాపురం గ్రామ పంచాయతీ నాయకుని ఆధ్వర్యం లోనే మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం. దీంతో రెవెన్యూ, పోలీసు సిబ్బంది రంగంలో దిగి విచారిస్తున్నారు. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణాతో లక్షల రూపాయలు ఆర్జించిన ఆ నాయకుడి కుటుంబం మరింత అక్రమార్జన చేయాలని వనదుర్గా పురం పంచాయతీ కేంద్రంగా ఇసుక అక్రమ రవాణాను భారీగా చేస్తున్నట్లు తెలియవచ్చింది. పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ కేంద్రంగా ఆ నాయకుడి కుటుంబ సభ్యులు భారీగా ఇసుక అక్రమ రవాణా దందా చేస్తున్నారని వినబడుతున్నది. వనదుర్గాపురం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా చేస్తూ చుట్టు ప్రక్కల గ్రామల ప్రజలకు ఇసుక అవసరమైన వారికి ఒక ట్రాక్టర్ ఇసుక 3 వేల నుండి 4 వేల రూపాయల వరకు విక్రయిస్తుండేవారు. వనదుర్గాపురం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా చేస్తుండటంతో పోలీసులు ఇది వరకే కొందరిపై కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసును పట్టించుకోని ఆ గ్రామ నాయకులు మళ్ళీ ట్రాక్టర్లతో అధికారుల నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తుండటంతో 'ప్రభాతవార్త' సాక్ష్యాలతో అధికారుల దృష్టికి తీసుకువచ్చింది. దీనిపై జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించి సత్వరం ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో నగరి ఆర్డీఓ సుజన, కార్వేటినగరం పోలీస్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్‌లు రంగంలోకి దిగారు. దీనితో పాటు పాలసముద్రం తహసిల్దారు బాబు, ఎస్ఐ సురేష్‌లు క్షేత్ర స్థాయి విచారణ నిర్వహించడంతో ఇసుక అక్రమ రవాణా దందా వెలుగు చూసింది. దీంతో సదరు అనుమానితులను తహసిల్దారు కార్యాలయంకు పిలిపించి తహసిల్దారు బాబు, ఎస్ఐ సురేష్‌లు వార్నింగ్ ఇచ్చారు.మండల పరిధిలో ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని తహసిల్దారు బాబు, ఎస్ఐ సురేష్‌లు హెచ్చరించారు.

## బీజేపీ జాతీయ కార్యదర్శికి ఘన స్వాగతం



రేణిగుంట, ఆగస్టు 4 ప్రభాతవార్త: బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్‌కు రేణిగుంట విమానాశ్రయంలో గురువారం ఘన స్వాగతం లభించింది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పర్యటన నిమిత్తం రేణిగుంట చేరుకున్న ఆయనకు విమానాశ్రయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సామంచి శ్రీనివాస్, తిరుపతి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు బీడీ బాలాజీ, రేణిగుంట మండల పార్టీ అధ్యక్షుడు బొబ్బిలిరెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు ఆవుల రాజశేఖర్‌రెడ్డి, రేణిగుంట పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మద్దాల రమేష్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో నెల్లూరు బయలుదేరి వెళ్లారు.